
పిల్లలు నటించాలంటే జిల్లా అధికారి అనుమతి తప్పనిసరి

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్మిస్తున్న సినిమా లు, సీరియల్స్‌లో నటించే పిల్లల సంఖ్య పెరుగుతోంది. తద్వారా వారి విద్యాభ్యాసం పై పెను ప్రభావం చూపుతోంది. ఈ కారణంతోనే ఇకపై పిల్లలు సినిమాలు, సీరియల్స్‌లో నటించాలంటే జిల్లా అధికారి అనుమతి తప్పనిసరి అని రాష్ట్ర కార్మికశాఖ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. రోజుకు ఐదు గంటలకు మించి పిల్ల లు నటించరాదని, నెలలో 27 రోజులు మాత్రమే షూటింగ్‌లకు ఉపయోగించాలని నిబంధనలు విధించింది. కార్మికశాఖ ఆదేశాలు పాటించకపోతే దర్శక, నిర్మాతలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

ఉపాధ్యాయుల మద్దతు ఎవరికో..!



● రేపు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ● మద్యం విక్రయాలపై హైకోర్టు జోక్యం


రంగనాథ్




పుట్టణ్ణ

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఎవరికి మద్దతు ఇస్తారనేది కుతూహలం రేకెత్తిస్తోంది. గ్యారెంటీ పథకాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్న కాంగ్రెస్ పార్టీకా లేదా బీజేపీ-జేడీఎస్ మైత్రి కూటమి అభ్యర్థికి ఓటు వేస్తారా అనేది తేలాల్సి ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అపార అనుభవం కల్గిన ఇద్దరు పోటీ చేస్తున్నారు. 2020లో బీజేపీ తరపున పోటీ చేసిన పుట్టణ్ణ ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్నారు. అప్పట్లో జేడీఎస్ అభ్యర్థిగా రంగంలో ఉన్న ఏపీ రంగనాథ్ ప్రస్తుతం బీజేపీ - జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. బెంగళూరు నగర, గ్రామీణ జిల్లా, రామనగర జిల్లాల పరిధికి సంబంధించి ఎన్నిక జరగనుంది. మొత్తం 19,200మందికి పైగా ఓటర్లు ఉన్నారు. వీరిలో ఏకంగా 12వేల మంది మహిళా ఓటర్లు ఉండడం ప్రత్యేకం. బెంగళూరు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రతిసారి రసవత్తరం అనిపిస్తున్నా పుట్టణ్ణ సునాయాసంగానే గెలుపొందుతూ వస్తున్నారు. 2002లో జేడీఎస్ అభ్యర్థిగా తొలిసారి ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2008, 2014లోనూ వరుసగా ఆయన జేడీఎస్ నుంచి ఎమ్మెల్సీగా విజయం సాధించారు. 2020లో మారిన రాజకీయాలతో జేడీఎస్ నుంచి బయటకు వచ్చారు. బీజేపీలో చేరి మరోసారి అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయన ప్రత్యర్థిగా ఏపీ రంగనాథ్ జేడీఎస్ తరపున బరిలో నిలిచారు. పుట్టణ్ణ సునాయాసంగానే నాల్గోసారి విజయం సాధించారు. 2026 నవంబరు 11 వరకు ఎమ్మెల్సీగా గడువు ఉన్నా గత ఏడాది జరిగిన శాసన సభ ఎన్నికల్లో పోటీ చేయదలిచి రాజీనామా చేశారు. రాజాజినగర్ శాసనసభ స్థానం చేసి ఓటమి చెందారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ కావడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. 7వ వేతన కమిషన్, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని, ఎయిడెడ్ విద్యా సంస్థల ఉపాధ్యాయులకు ఆరోగ్య బీమా, పదోన్నతులు, వేతనాల పెంపు, ఉపాధ్యాయులందరికీ జ్యోతి సంజీవని, ఉపాధ్యాయుల సంక్షేమనిధి సద్వినియోగం, ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, రెన్యూవల్స్‌కు కఠిన నిబంధనల అంశంపై ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు అభ్యర్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున సమస్యలు పరిష్కరిస్తామని పుట్టణ్ణ హామీ ఇస్తున్నారు. గడిచిన రెండున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయ సమస్యలపై మద్దతుగా ఉన్నానని ప్రచారం చేసుకుంటున్నారు.

రేపు పోలింగ్

మూడు జిల్లాల పరిధిలో జరిగే ఎన్నికల పోలింగ్ ఈనెల 16న శుక్రవారం జరగనుంది. ఇందు కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. గుర్తులు లేకుండా ప్రాధాన్యతా పరంగా పోలింగ్ జరగనుంది.



పార్టీలు మారిన పుట్టణ్ణను నమ్మరు : రంగనాథ్

పుట్టణ్ణ రెండు పార్టీలు మారి ప్రస్తుతం మూడో పార్టీ నుంచి అభ్యర్థిగా రంగంలో ఉన్నారని, ఆయనను ఉపాధ్యాయులు నమ్మరని బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి ఏపీ రంగనాథ్ తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరంగా పోరాటాలు చేస్తున్నానని, వారితో కలసి ఏళ్ల తరబడి ప్రయాణించానని పేర్కొన్నారు. బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలు ఉత్సాహంతో ఉన్నారన్నారు.

మద్యం విక్రయాల బ్రేక్‌పై హైకోర్టు జోక్యం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున రెండు రోజులపాటు నగర వ్యాప్తంగా మద్యం విక్రయాలు నిలిపివేయాలనే ఆదేశాలపై హైకోర్టు జోక్యం చేసుకుంది. 48 గంటలపాటు ఎన్నికల కోసం మద్యం విక్రయాలు ఆపేయాల్సిన అవసరం ఉందా... అంటూ ప్రశ్నించింది. మద్యం వ్యాపారులు దాఖలు చేసుకున్న పిటీషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన ధర్మాసనం ఎన్నికలు జరిగే 16న ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి దాకా మద్యం విక్రయాలు ఆపితే సరిపోతుందని తీర్పునిచ్చింది. కాగా ఓట్ల లెక్కింపు జరిగే ఈనెల 20న కూడా ఇదే ప్రక్రియ కొనసాగించాల్సి ఉంటుందని న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఆర్ కృష్ణకుమార్ ధర్మాసనం అభిప్రాయపడింది.



గతం కంటే ఎక్కువ మెజారిటీ సాధిస్తా : పుట్టణ్ణ

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరంగా పనిచేశానని, మూడు జిల్లాల పరిధిలో ఉపాధ్యాయులందరితో సంబంధాలు ఉన్నాయని పుట్టణ్ణ తెలిపారు. పార్టీ మారినా తనకు వ్యక్తిగతంగా మద్దతు ఇచ్చేవారు ఉన్నారని వివరించారు. గతంలో ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ మెజారిటీ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల తరపున చేసిన పోరాటమే తనను గెలిపిస్తుందన్నారు.


ముఖ్యమంత్రి సిద్దరామయ్య నుంచి సన్మానం అందుకున్న నాసిర్, చంద్రశేఖర్, అజయ్ మాకెన్

రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు

● రాష్ట్రం నుంచి కేంద్ర మాజీ మంత్రి అజయ్ మాకెన్‌కు అవకాశం
● చంద్రశేఖర్, నాసిర్‌కు మరో చాన్స్

బెంగళూరు/బళ్లారి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల నామినేషన్లకు గడువు సమీపిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు తమ అభ్యర్థులను ప్రకటించింది. రాష్ట్రం నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాహుల్‌గాంధీకి అత్యంత ఆప్తుడైన ఢిల్లీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ అజయ్ మాకెన్ పోటీ చేయనున్నారు. బెంగళూరులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోపాటు పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచన మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఫోన్‌లో సంప్రదించిన అనంతరం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ముగ్గురి పేర్లతో జాబితాను విడుదల చేశారు. వీరిలో డాక్టర్ మాకెన్‌తోపాటు డాక్టర్ సయ్యద్ నసీర్ హుసేన్, జీసీ చంద్రశేఖర్ ఉన్నారు. అజయ్ మాకెన్ మినహా మిగిలిన ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు కావడం విశేషం. రిటైర్ అయిన హనుమంతయ్య స్థానంలో అజయ్ మాకెన్‌కు అవకాశం కల్పించారు. రాష్ట్ర శాసనసభలో కాంగ్రెస్‌కు 136 మంది ఎమ్మెల్యేల బలం ఉండడంతో మూడు రాజ్యసభ స్థానాలను సులభంగా కైవసం చేసుకోవచ్చు.

జాతీయ రాజకీయాల్లో కీలకుడు అజయ్ మాకెన్

దేశ రాజధాని ఢిల్లీలో జన్మించిన అజయ్ మాకెన్ కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో కీలకంగా పనిచేశారు. ఏఐసీసీలో కీలకుడిగా వ్యవహరించిన ఆయన ఢిల్లీ రాష్ట్రంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది షీలాదీక్షిత్ కేబినెట్‌లో మంత్రిగా కొనసాగారు. 2004 నుంచి 2014 మధ్య ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ పాలనలో కేబినెట్ మంత్రిగా పనిచేశారు. ఇటీవల ఆయన పార్టీ రాజకీయాలతోనే పరిమితంగా ఉండగా కర్ణాటక నుంచి రాజ్యసభకు అభ్యర్థిగా ప్రకటించారు.

అధికారి ప్రతినిధిగా సుపరిచితుడు చంద్రశేఖర్

మైసూరు జిల్లా మిర్లెలో జన్మించిన జీసీ చంద్రశేఖర్ కేపీసీసీలో వివిధ హోదాలలో కొనసాగారు. పార్టీ అధకార ప్రతినిధిగా సుపరిచితుడు. సర్వశిక్షా అభియాన్‌కు ఏడాది పాటు ఛైర్మన్‌గా వ్యవహరించారు. జలమండలి ఛైర్మన్‌గా రెండేళ్లపాటు కొనసాగారు. ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి వ్యవహరించిన చంద్రశేఖర్‌కు రాజ్యసభ అవకాశం లభించింది. ప్రస్తుతం రెండోసారి ఆయన రాజ్యసభ అభ్యర్థిగా పార్టీ ఖరారు చేసింది. రాష్ట్ర హోంశాక మంత్రి పరమేశ్వర్‌కు అత్యంత ఆప్తుడిగా పేరొందారు.

విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ సేవలో నాసిర్

దావణగెరె జిల్లా చెన్నగిరికి చెందిన డాక్టర్ సయ్యద్ నాసిర్ హుసేన్ విద్యార్థి దశనుంచే కాంగ్రెస్‌లో సేవలు ప్రారంభించారు. ఇటీవల కొంత కాలంగా బళ్లారి కేంద్రంగా ఆయన రాజకీయాలు కొనసాగిస్తున్నారు. ఆయనను కాంగ్రెస్ పార్టీ మరోసారి రాజ్యసభకు ఎంపిక చేసింది. 2018లో ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. పదవీ కాలం ముగియడంతో తిరిగి ఆదే స్థానంలో ఎంపిక చేశారు. ఆయన ఢిల్లీలో విద్యాభ్యాసం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఢిల్లీలో చదువుతున్న రోజుల్లోనే విద్యార్థి సంఘాల్లో చురుకుగా పాల్గొనేవారు. యూపీఏ ప్రభుత్వంలో లేబర్ యూనియన్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకి వీర విధేయుడిగా గుర్తింపు పొందారు. రాజ్యసభలో ఎన్నో అంశాలపై ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రంలో రాహుల్ పాదయాత్ర సాగిన సమయంలో నాసిర్ కీలకంగా వ్యవహరించి మరింత దగ్గరవాడయ్యాడు. నాసిర్ ఎంపికపై మంత్రి నాగేంద్ర, బళ్లారి ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్ హెడ్గే, సోము, గుమ్మనూరు జగన్ హర్షం వ్యక్తం చేశారు.

వామ్మో వెల్లుల్లి..!

● కిలో రూ.400 దాటేసింది..

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఒకసారి టమోటా.. మరోసారి ఉల్లి.. ధరలు ఆకాశన్నంటి వినియోగదారుల్లో గుబులు పుట్టించగా ఈసారి వెల్లుల్లి వంతు వచ్చింది. రాష్ట్రంలో దాదాపు నాలుగు నెలలుగా వెల్లుల్లి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా కిలో వెల్లుల్లి చిల్లర ధర రూ. 400కు చేరుకుంది. వెల్లుల్లి ధరలు అమాంతం పెరుగుతుండటంతో మసాలాల్లో దీని వాడకాన్ని బాగా తగ్గించేశారు. రాజధాని బెంగళూరులోని కొన్ని హోటళ్లయితే వెల్లుల్లి వాడటం లేదని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. బెంగళూరు యశ్వంతపురంలోని ఏపీఎంసీ మార్కెట్‌కు వెల్లుల్లిపాయల రాక దాదాపు 50 శాతానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం నాణ్యమైన వెల్లుల్లి ధర ఈ మార్కెట్‌లో సగటున రూ. 350-400 పలుకుతోంది. బెంగళూరు రిటైల్ వెల్లుల్లి వర్తకుల సంఘం కార్యదర్శి దీపక్ జె.షా నగరంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ యశ్వంతపురం ఏపీఎంసీ మార్కెట్‌కు గతంలో 40 కిలోల బరువు కలిగిన 3వేలకు పైగా బస్తాల వెల్లుల్లి వచ్చేదని, ప్రస్తుతం ఇది 1200 కు తగ్గిపోయిందన్నారు. ఉత్తరభారత్ దేశంలో కరువు పరిస్థితి కారణంగానే పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గిందన్నారు. రాష్ట్రంలోని హావేరి జిల్లాలో మాత్రమే వెల్లుల్లిని అధికంగా పండిస్తారు. మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ నుంచి వెల్లుల్లి దిగుబడి అధికంగా ఉంటుంది. ప్రస్తుతం మధ్యప్రదేశ్ నుంచి మాత్రమే వెల్లుల్లి దిగుమతి అవుతోందని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ నెలాఖరు నాటికి మిగిలిన రెండు రాష్ట్రాల నుంచి కూడా వెల్లుల్లి దిగుమతి పెరిగే అవకాశం ఉందని, అంతవరకు ధరలు ఇలాగే ఉంటాయని భావిస్తున్నట్లు మార్కెట్‌వర్గాలు వెల్లడించాయి.



పుల్వామా యోధుల త్యాగాలు మరువలేనివి

● ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జమ్ము-కశ్మీర్‌లోని పుల్వామాలో ఐదేళ్ల క్రితం దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరయోధులను దేశం సదా స్మరించుకుంటూనే ఉంటుందని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. యలహంకలోని సీఆర్‌పీఎఫ్ ఆవరణలో బుధవారం పుల్వామా వీర యోధుల ఐదో వార్షిక శ్రద్ధాంజలి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయోధుల స్మారక స్థూపానికి పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించేవారిని ఎన్నడూ మరువరాదని యువతకు ఉద్బోధించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ రిటైర్డు ఐజీపీ అర్కేష్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి నికేత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పుల్వామా వీరయోధులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.


వీరయోధుల స్మారకానికి నివాళులు అర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

భాష, నేల విషయంలో రాజీ పడే ప్రశ్నే లేదు

● డీసీఎం డీకే శివకుమార్ స్పష్టీకరణ

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాష, నేల విషయంలో రాజీ పడే ప్రశ్నేలేదని, వీటి సంరక్షణే తమ ప్రభుత్వ తొలి కర్తవ్యంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. బెంగళూరు కేపీసీసీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బెళగావిలో మహారాష్ట్ర ఏకీకరణ సమితి ఆగడాలు ఎక్కువయ్యాయని వీటిని సహించబోమని హెచ్చరించారు. మహారాష్ట్రలో అమలు చేస్తున్న ఆరోగ్య పథకాన్ని కర్ణాటక సరిహద్దులోని నాలుగు జిల్లాల్లో మరాఠీల కోసం అమలు చేసేందుకు వీలుగా ప్రత్యేక కార్యాలయాన్ని ప్రారంభించాలంటూ ఎంఈఎస్ చేసిన డిమాండ్‌పై స్పందించిన ఆయన ఇది తమకు ఏమాత్రం సమ్మతం కాదన్నారు. భాషా ప్రాతిపదిక రాష్ట్రాలు ఏర్పాటైన తర్వాత కూడా ఇలాంటి పేచీలు దేశ సమాఖ్య వ్యవస్థను బలహీన పరుస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బెళగావి గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం తమ ప్రభుత్వం ఎన్నో సదుపాయాలను సమకూరుస్తోందన్నారు. కన్నడ నాట గాలి పీలుస్తూ, ఇక్కడి నీటిని తాగుతూ, ఇక్కడ నివసిస్తూ వ్యవసాయం చేసుకుంటున్న మరాఠీలంతా కన్నడిగులేనని ఆయన స్పష్టం చేశారు. బెళగావి గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూములకు సాగునీటిని అందించేందుకు రూ.900 కోట్లతో ఒక ప్రత్యేక పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఎంఈఎస్ రాజకీయంగా బలహీనంగా మారిందని, కర్ణాటక అంతర్గత పాలనా వ్యవహారాల్లో మహారాష్ట్ర తలదూర్చబోదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

మాజీ ఉపరాష్ట్రపతిని సత్కరించిన ఉదయగిరి వాసులు


వెంకయ్యనాయుడిని సన్మానిస్తున్న ప్రముఖులు


బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పద్మవిభూషణ్ ప్రకటించడంపై నగరంలోని ఉదయగిరి నియోజకవర్గ వాసులు బుధవారం ఆయనను ఘనంగా సత్కరించారు. కర్ణాటక ఫిలిం సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు, ఉదయగిరి బీజేపీ నేత గంగవరపు సుబ్బారావు ఆధ్వర్యంలో బెంగళూరు రాజ్‌భవన్‌లో ప్రతినిధుల బృందం వెంకయ్యనాయుడిను సత్కరించింది. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ పరిస్థితులను ప్రతి పల్లెను పేరుతో సహా అడిగి మరీ వెంకయ్యనాయుడు తెలుసుకున్నారు. అనంతరం గంగవరపు సుబ్బారావు మాట్లాడుతూ వెంకయ్యనాయుడు ఉదయగిరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పలు అభివృద్ధి కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేశారని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండేవారన్నారు. సేవా తత్పరత కల్గిన ఆయనకు పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కూనల వెంకటేశ్వరరావు, మద్దినేని మోహన్‌రావు, ఇడమకంటి లక్ష్మిరెడ్డి, రెడ్డదిన్నె కేశవరావు, కురుగొండ్ల దామోదర్, కరణం నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

త్వరలో డ్రైవర్ రహిత రైలు

● నమ్మ మెట్రో రైలు సేవల్లో మరో మైలురాయి ● చైనా నుంచి బెంగళూరుకు చేరిన బోగీలు

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నమ్మ మెట్రో రైలు సేవలలో మరో ఆధునాతన ఆవిష్కరణకు అడుగులు పడుతున్నాయి. డ్రైవర్ రహిత రైలు, బోగీలు చైనా దేశం నుంచి బెంగళూరుకు చేరాయి. ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలోని హెబ్బగూడి డిపోకు బుధవారం తెల్లవారుజామున వచ్చినట్టు బీఎంఆర్‌సీఎల్ అధికారులు ప్రకటించారు. ఆరు బోగీలు కల్గిన మెట్రో రైలు డ్రైవర్ లేకుండా నడుస్తుంది. ఆర్‌వీ రోడ్డు, బొమ్మసంద్ర, జయదేవ ఆసుపత్రి, సిల్క్‌బోర్డ్, ఎలక్ట్రానిక్ సిటీల మధ్య ఈ రైలు సంచరించనుందని తెలిపారు. చైనా ప్రభుత్వానికి అనుబంధమైన సీఆర్‌ఆర్‌సీ నాన్‌జింగ్ పుజెన్ కో లిమిటెడ్ తయారు చేసింది. ఇది బీఎంఆర్‌సీఎల్‌కు 216 కోచ్‌లను తయారు చేసేలా 2019లో రూ.1578 కోట్లతో ఒప్పందం చేసుకుంది. జనవరి 24న చైనాలో బయల్దేరిన బోగీలు ఫిబ్రవరి 6 నాటికి చెన్నై ఓడరేవుకు చేరాయి. రైలును బెంగళూరుకు రోడ్డు మార్గంగా భారీ వాహనాల ద్వారా తరలించనున్నారు. కస్టమ్స్ క్లియరెన్స్ కోసం కొన్ని రోజులపాటు అక్కడే నిలిపారు. హెబ్బగూడి డిపోలో చైనా ఇంజనీర్ల పర్యవేక్షణలో కోచ్‌ల అమరిక చేపట్టనున్నారు. 8నుంచి 10 సార్లు పరీక్షలు జరిపి ఆ తర్వాత డైనమిక్‌తో పాటు వివిధ కోణాలలో పరీక్షలు కొనసాగిస్తారు. ఇంటర్‌ఫేజ్ పరిశీలనలు ముగిస్తారు. లఖ్‌నవ్‌కు చెందిన రీసెర్చ్ అండ్ డిజైన్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ పర్యవేక్షణలో మెయిన్ లైన్‌లను పరిశీలిస్తారని బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. ప్రక్రియ ముగిశాక రైల్వే సేఫ్టీ చీఫ్ కమిషనర్‌కు నివేదిక పంపుతామని, సాంకేతికంగా అనుమతులు వచ్చాక సంచారం ప్రారంభించే అవకాశం ఉంటుందన్నారు. యెల్లో కారిడార్ ప్రారంభించేందుకు ఈ ఏడాది మూడో త్రైమాసికం కావచ్చునని, ఇందుకు 8 రైళ్ల అవసరం కావచ్చునని అధికారులు వెల్లడించారు.


భారీ ట్రక్‌లో తరలిస్తున్న డ్రైవర్ రహిత మెట్రో రైలు బోగీలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.92	1,611.56
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	163	8,384
సామర్థ్యం (టీఎంసీలు)	9.38	40.74

రూ. 7.26 కోట్ల కరువు నష్టం నిధుల విడుదల

బళ్లారి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గత ఖరీఫ్‌లో పంట నష్టపోయిన 36,944 రైతులకు ఒక్కొక్కరికి రూ. 2 వేల ప్రకారం రూ. 7.26 కోట్ల నిధులను వారి ఖాతాలో జమ చేసినట్లు బళ్లారి డి.సీ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. కేంద్ర నుంచి పరిహారం ఇంకా విడుదల కావాల్సి ఉందని, కాకపోతే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇవ్వాల్సిన పరిహారం రైతులకు ఇచ్చామని తెలిపారు. బళ్లారి జిల్లా ఐదు నియోజకవర్గాల్లోని 29,636 హెక్టార్లలో వర్షాధారం కింద 11,255హెక్టార్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. సిరుగుప్ప తాలూకాలో 21,660 మంది రైతులకు, బళ్లారి తాలూకాలో 2,682 మంది రైతులకు, సండూరు తాలూకాలో 11,779 మంది రైతులకు, కురుగోడు తాలూకాలో 383 మంది రైతులకు కంప్లిలో 440 మంది రైతులకు పంట నష్టపరిహారం జమచేసినట్లు డీ.సీ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా రాఘవేంద్ర యాదవ్



బాధ్యతలు స్వీకరిస్తున్న రాఘవేంద్ర యాదవ్

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 14 : బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా నూతన అధ్యక్షుడిగా రాఘవేంద్ర యాదవ్ నియమితులైనట్లు బీజేపీ నాయకులు తెలిపారు. సంగనకల్లు రోడ్డులోని వాజ్‌పేయి బారంగేలోని బీజేపీ జిల్లా యూనిట్ కార్యాలయంలో రాఘవేంద్ర యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బళ్లారి సిటీ డాక్టర్ అరుణ్ కామినేని, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమనగౌడ్, ఉడేద సురేష్, జిల్లా రైతు మోర్చా జిల్లా అధ్యక్షులు ఐనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులు సాధన్ హిరేమఠ్, కార్యదర్శులు సుమారెడ్డిలు పాల్గొన్నారు.

సమాంతర జలాశయ నిర్మాణానికి నిధులివ్వాలి



మాట్లాడుతున్న కరవే కృష్ణగౌడ తదితరులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 14: తుంగభద్ర జలాశయంలో పూడికతీసి, నవలీ దగ్గర సమాంతర రిజ్వాయర్ల నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు ఇవ్వాలని కన్నడ రక్షణ వేదిక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కోరింది. విలేకరుల సమావేశంలో సంస్థ అధ్యక్షుడు పి.కృష్ణగౌడ మాట్లాడుతూ తుంగభద్ర మనుగడ కోసం ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఆల్మట్టి జలాశయంపై శ్రద్దపెట్టడంలేదని, నదీ ఆనకట్టల గురించి న్యాయస్థానాలకు సరైన సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఒకవైపు హామీ పథకాల వల్ల అభివృద్ధి మందగించిందని, మరోవైపు మౌలిక వసతులకు ప్రాధాన్యత తగ్గిపోయిందన్నారు. ఇందుకోసం ఎలాంటి పోరాటానికైనా సిద్దంగా ఉన్నామన్నారు. విలేకరుల సమావేశంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ తంబాగి, జిల్లా అధ్యక్షులు కోరి రమేశ్, గౌరవాధ్యక్షులు శంకర్‌దాస్, ఉపాధ్యక్షులు గజేంద్ర, ప్రధాన కార్యదర్శి హుస్సేన్ భాష తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి కుంభోత్సవం



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీరాములు

కంప్లి, ఫిబ్రవరి 14 : కంప్లి తాలుకా పాత నెల్లూడిలో జరిగిన దుర్గాదేవి కుంభోత్సవంలో ఎమ్మెల్యే గణేష్, మాజీమంత్రి శ్రీరాములు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేయడం వల్లే గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని తెలిపారు. నాయకులను వారి కార్యకర్తలు, అభిమానులు అభినందించారు.

ఎండిన చెరువులు.. పండని చేపలు

● వర్షాభావంతో కష్టాల్లో మత్స్యకారులు ● తమను ఆదుకోవాలని వినతి

బళ్లారి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితుల కారణంగా మేజర్, మైనర్ ఇరిగేషన్ చెరువులు నీరు లేక ఎండిపోయాయి. దీని ఫలితంగా చేపల పెంపకం, దాని ద్వారా జీవనం సాగించే మత్స్యకార కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. కర్ణాటక రాష్ట్రంలోనే అత్యంత ఎక్కువ శాతం చేపల పెంపక ప్రాంతంగా గుర్తింపు పొందిన బళ్లారి, విజయనగర జిల్లాల్లోనే ఈ ఏడాది వర్షాభావం కారణంగా చెరువులు, కుంటల్లో నీరు లేక పోవడం కారణంగా చేపలు పూర్తిగా చనిపోయాయని చేపల పెంపకం దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బళ్లారి, విజయనగర జిల్లాలో మొత్తం 11 నియోజక వర్గాలు ఉన్నాయి. జిల్లా విభజన జరిగినా ప్రస్తుతం మత్స్య శాఖ కార్యాలయం రెండు జిల్లాలకూ ఒకటే ఉంది. బళ్లారి జిల్లాలో బళ్లారిలో ఒక చెరువు, కంప్లిలో 3, సిరుగుప్పలో 2, సండూరులో 14 మేజర్ చెరువులు ఉన్నాయి. అలాగే విజయనగర జిల్లాలోని విజయనగర డివిజన్‌లో 9, హగరిబొమ్మనహళ్‌లో 10, కూడ్లిగిలో 25, కొట్టూరులో 4, హడగలిలో 9, హర్పనహళ్లిలో 25 చెరువులు ఉన్నాయి. మొత్తం బళ్లారి జిల్లాలో మేజర్ చెవులు 40, హొస్పేట్ (విజయనగర) జిల్లాలో 81 మేజర్ చెరువులున్నాయి. ఇక మైనర్ చెరువులు కూడా రెండు జిల్లాలో కలిపి 150కి పైగా చెరువులున్నాయి. మత్స్యశాఖ లెక్కల ప్రకారం.. 40 హెక్టార్లకు మించిన చెరువులను మేజర్ చెరువులుగానూ. 40 హెక్టార్ల విస్తీర్ణం కన్నా తక్కువ ఉండే చెరువులను మైనర్ చెరువులుగా అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. బళ్లారి, విజయనగర జిల్లాలో ఉండే మైనర్, మేజర్ చెరువులతో పాటు ప్రధాన నీటి ప్రాజెక్టు అయిన తుంగభద్ర డ్యాంలోనూ లక్షల మెట్రిక్ టన్నుల చేప పిల్లలను ఉత్పత్తికి వదిలారు. అయితే 2023-2024 ఏడాదిలో వర్షాభావ పరిస్థితుల కారణంగా చేపలు వృద్ధికాలేదు. జలాశయాల్లో నీరు లేక చేపలు పూర్తిగా చనిపోయాయి.

రెండు జిల్లాలో వివిద సొసైటీలు, మత్స్యకార సంఘాలు, చిన్నచిన్న మత్స్యకుటుంబాలు సుమారు 24 వేలకు పైగా జీవనం సాగిస్తున్నాయి.

గతేడాది రెండు జిల్లాలో సుమారు 27,869 మెట్రిక్ టన్నుల చేపలు ఉత్పత్తి అయ్యాయి. కానీ ఈ ఏడాది కనీసం 5 వేల మెట్రిక్ టన్నుల చేపలు కూడా ఉత్పత్తి కాలేదని అధికారులు పేర్కొన్నారు. ఈఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా మత్స్యకార కుటుంబాలు పూర్తిగా జీవనం కోల్పోయాయి. ప్రభుత్వాలు, మత్స్యకార సొసైటీలు ఈ ఏడాది తమ కుటుంబాలను ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.



గతంలో అరకొర నీటిలోకి వదిలిన చేపలు

ఘనంగా సరోజినీ నాయుడు జయంతి



సరోజినీ నాయుడుకు నివాళులర్పిస్తున్న రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 14: సంజీవరాయకోట పాఠశాలలో సరోజినీ నాయుడు 145 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక యాక్టివ్ టీచర్స్ వేదిక అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి మాట్లాడారు. 1905లో బెంగాల్ విభజనను వ్యతిరేకించడం ద్వారా గోపాలకృష్ణగోఖలే, మహమ్మదాలీ జిన్నా, మహాత్మాగాంధీ, జవహరాలాల్ నెహ్రూ, అనిబెసెంట్ వంటి జాతీయ నాయకులతో కలిసి ఆమె స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. కవయిత్రిగా, సంగీత విద్వాంసురాలిగా, భారత కోకిలగా ప్రసిద్ధికెక్కారని తెలిపారు. ఆమె పోరాట స్ఫూర్తిని గుర్తించిన నేతలు ఆమెను ఉత్తరప్రదేశ్ రాష్ట్ర తొలి గవర్నర్‌గా నియమించారు. విద్యార్థులు దేశభక్తి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభావంతులైన విద్యార్థులు అంజలి, గాదిలింగకు బహుమతులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు బసవరాజు, మోదీన్‌సాబు, చన్నమ్మ, శేశమ్మ, రామాంజినేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతంగా సాగుతున్న రాజ్యాంగ జాతా



కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 14: భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75ఏళ్ల పూర్తయిన సందర్భంగా చేపట్టిన రాజ్యాంగ అవగాహన జాతా బళ్లారి జిల్లాలో విజయవంతంగా నడుస్తోందని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో కొనసాగుతున్న రాజ్యాంగ అవగాహన జాతా ఈనెల 23వరకు జిల్లాలోని 100 గ్రామపంచాయితీలు, 8పట్టణ స్థానిక సంస్థల్లో పర్యటిస్తుందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ఆశయాలు, విలువలను ప్రదర్శించే ఎల్ఈడీ స్క్రీన్‌తో కూడిన స్టిల్ చిత్రాలను ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 24, 25 తేదీల్లో బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న రాజ్యాంగ అవగాహన జాతా భారీ సదస్సులో పాల్గొని ముగుస్తుందన్నారు. ప్రతిరోజు ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలో మహిళలు కలశం, పూర్ణకుంభాలను మోస్తూ నిశ్చలచిత్రానికి స్వాగతం పలుకుతున్నారన్నారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొని సంగీతం, సామూహిక నృత్యం, లఘునాటిక, వన్‌రోల్ ప్లేవంటి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారన్నారు. రాజ్యాంగ అవగాహన జాతా ఉద్యమం నేపథ్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి ఉత్తమ చిత్రాల ప్రదర్శనకు ఫిబ్రవరి 16న వాల్మీకి భవన్‌లో కళా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజ్యాంగ అవగాహన జాతా కార్యక్రమం గురించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయబడిన ఫోటోలు, వీడియోలను వీక్షించవచ్చని, లైక్ లేదా షేర్ కామెంట్స్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియచేయవచ్చన్నారు. ఈసందర్భంగా జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సంకనూర్, జిల్లాసాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సతీశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో రాజ్యాంగంపై అవగాహన



నెల్లూడిలో రాజ్యాంగరథం ఊరేగింపుకు ఆహ్వానం పలుకుతున్న అధికారులు

కంప్లి, ఫిబ్రవరి 14 : ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజ్యాంగంపై ప్రతి గ్రామంలో అవగాహన కలిగించేందుకు ప్రారంభమైన రాజ్యాంగ జాతా బుధవారం కంప్లి తాలుకా పరిధిలోని నెల్లూడి గ్రామానికి చేరుకుంది. అంతకుముందు గ్రామ పంచాయతీ సభ్యులు, అధ్యక్షులు పూలమాలలతో రథాన్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివరాజ్ మాట్లాడుతూ బాబా అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని చదివి అర్థం చేసుకుని ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు, యువతీయువకులు రాజ్యాంగ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని సూచించారు. వారితో పాటు ముఖ్య అధికారి దుర్గన్న, గ్రామ పంచాయతీ అధ్యక్షులు రాజమ్మ, పీడీవో శేషగిరి, బసవరాజు, వీరేష్, విరుపాక్షి, గ్రామ పంచాయతీ సభ్యులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సంఘ సంస్థ నేతలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ కర్మాగారానికి నీటి మళ్లింపుపై పరిశీలన

కంప్లి, ఫిబ్రవరి 14 : తిమ్మలాపురం- దరోజీ వద్ద జిందాల్ నడుపుతున్న మోటార్లను, లిఫ్ట్ ఇరిగేషన్ ట్యాంకును భూగర్భ జల శాఖ అధికారి అరుణ్, విద్యుత్ శాఖ అధికారి జగ్గనాయక్, కాలుష్య నియంత్రణ అధికారి హనుమంతప్పలు పరిశీలించారు. ఈ నెల 8వ తేదీన కుడితిని పట్టణంలో పల్లెద భవనంలో జరిగిన జన స్పందన సమావేశంలో కుడితిని పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ తిమ్మలాపురం దరోజీ వద్ద అక్రమంగా జిందాల్ కర్మాగారం నీటిని మళ్లిస్తున్నారనే విషయంపైన వినతిపత్రం ఇవ్వడంతో జిల్లా అధికారి ప్రశాంత్ మిశ్రా స్పందించి ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు పరిశీలనకు దిగారు.

ఈ సందర్భంగా పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే కుడితిని చుట్టూ వుండే కర్మాగారాల వల్ల ఎంతో మంది కాలుష్యం, దుమ్ముధూళితో అనారోగ్యానికి గురవుతున్నారని, దీనికి తోడు అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా నీరు మళ్లించుకోవడం ఎంతమాత్రం తగదన్నారు. సుమారు పది బోర్లు వేయగా ఆరు బోర్ల నుంచి ఒక ట్యాంకుకు నీరు మళ్లించి అక్కడి నుంచి 25 హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్ల ద్వారా కుడితిని జిందాల్ శాఖకు నీటిని మళ్లిస్తున్నారన్నారు. దీనిపై భూగర్భజల శాఖ అధికారి అరుణ్ మాట్లాడుతూ వెంటనే ఈ మోటార్ల కనెక్షన్లను తొలగించాలని కేబీ అధికారులకు సూచించారు. అనుమతులు లేకుండా నీటిని మళ్లించడంపై చర్యలు తీసుకుంటామన్నారు. మొత్తానికి జనస్పందనలో ఇచ్చిన మనవికి జిల్లా అధికారులు స్పందించడంతో కుడితిని, దరోజీ, తిమ్మలాపురం ప్రజలు అభినందనలు తెలిపారు.



పొలాల్లో మోటార్లను పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారులు

జేఈఈలో ఉత్తమ ఫలితాలు సాధించిన బెస్ట్ కళాశాల విద్యార్థులు



హర్షగుప్తా, గౌరీశంకర్, అహ్మద్‌అపాక్, బసవలీల, శశిధర, మేధా అనిల్‌కుమార్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 14: బళ్లారి ఇండిపెండెంట్ ప్రీ గ్రాడ్యుయేట్ (బెస్ట్)కళాశాలలో జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో విద్యార్థులు అత్యున్నతశాతం మార్కులు సాధించి కళాశాలకు ఘనత తీసుకొచ్చారని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వారిలో హర్షగుప్తా- 99.17 శాతం మార్కులు సాధించారని, అలాగే మాదినేని గౌరిశంకర్ 94.11 శాతం, టీ.సయ్యద్ అహ్మద్ అప్సాక్-93.43, బసవలీల 93.41, శశిధర 93,28, మేధా 92,62, ఇంజినీరింగ్‌లో అనిల్ కుమార్ 92.0 శాతం మార్కులు సాధించారన్నారు. సుమారు 20 మంది విద్యార్థులు 85శాతానికి పైగా మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను కాలేజ్ పాలక మండలి, లెక్చరర్ల బృందం అభినందించిందన్నారు.



అప్పుడే భగ్గుమంటున్న భానుడు

బళ్లారి సిటీ, రూరల్, ఫిబ్రవరి 14: బళ్లారి నగర, గ్రామీణ ప్రాంతాలలో ఎండలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. సాధారణంగా ప్రతి ఏటా మార్చి నెలలో ప్రారంభం కావాల్సిన ఎండలు ఫిబ్రవరి రెండో వారం నుంచి భారీగా పెరుగుతున్నాయి. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు భానుడు భగభగమంటూ తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 38డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పైగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఫిబ్రవరి నెలలోనే ఇంత స్థాయిలో ఉంటే ఇక మార్చి ఏప్రిల్, మే ఈ మూడునెలల్లో ఏ మేరకు జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతాడోనని జనం భయాందోళన చెందుతున్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థిలు ఏర్పడడంతో సరైన వర్షాలు కురవక డ్యాంలు, కుంటలు, చెరువులు నీరు లేక పూర్తిగా అడుగంటి బీటలు పారాయి. దీంతో చెట్లు కూడా అక్కడక్కడ ఎండిపోతున్నాయి.

చల్లటి పానీయాలపై జనం దృష్టి

ఈ ఏడాది మార్చిలో 45డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఎండలు పెరిగే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. ఈనేపథ్యంలో ఎండల తీవ్రతకు జనం చల్లటి పానీయాల సేవనంపై దృష్టి సారిస్తున్నారు. పుచ్చకాయలు, కర్బూజ, కొబ్బరి బోండాలు, తదితరాలతోపాటు ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింక్స్, తదితర వాటిపై కూడా అధారపడి ఎండ వేడి నుంచి బయటపడుతున్నారు. ఎండ వేడికి తట్టుకునేందుకు ఇంట్లో కూలర్లు, ఏసీలు, ఫ్యాన్ల వినియోగం మరింత పెంచుకునేందుకు అవకాశం ఉన్నవారు వాటిని సిద్దం చేసుకుంటున్నారు.



నిర్మానుష్యంగా మారిన ఓ రోడ్డు

26 నుంచి గద్దే ఖాదర్ బాషా ఉరుసు మహోత్సవం

సిరుగుప్ప, ఫిబ్రవరి 14 : ఫిబ్రవరి 26, 27, 28 తేదీల్లో ముక్కుందిలో గద్దే ఖాదర్ బాషా ఉరుసు జరుగుతున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. సిరుగుప్ప, సింధనూరు తాలుకాల మధ్య తుంగభద్ర నది తీరాన వెలసిన ఖాదర్ బాషా 393వ ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకుని వివిధ ధార్మిక కార్యక్రమాలు జరుగనున్నాయని, ఖవాలీ జరుగనుందని తెలిపారు. 26న గంధం, 27న ఉరుసు, 28న జియారత్ కార్యక్రమాలు జరుగనున్నాయని పేర్కొన్నారు. ప్రజలు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని దర్గా కమిటీ సభ్యులు కోరారు.

ప్యాకెట్ క్యాలెండర్ విడుదల

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 14 : బళ్లారి నగరంలో భోవి సంఘం కార్యాలయంలో జిల్లా భోవి సంఘం ప్యాకెట్ క్యాలెండర్‌ను 35వ వార్డు కార్పొరేటర్ శ్రీనివాస్, వడ్డే సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఆర్గనైజర్ సెక్రెటరీ జలాల్ గాదిలింగ, ఉలిగప్ప, రాము కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

సిరుగుప్పలో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే

సిరుగుప్ప, ఫిబ్రవరి 14 : సిరుగుప్ప పట్టణంలో అపరిశుభ్రత విలయతాండవం చేస్తోంది. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్రధానంగా 24వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రంవద్ద చెత్తాచెదారాన్ని తొలగించడంలో పౌర కార్మికులు నిర్లక్ష్యం వహించడం విడ్డూరంగా వుంది. శానిటరీ అధికారుల నిర్లక్ష్యంతో చెత్తాచెదారం పేరుకుపోతోందని, తక్షణమే అపరిశుభ్రతను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రం వద్ద చెత్తాచెదారం

హోసూరు జోన్

కంచెర్ల గోపన్న జీవితం ధన్యం



ఆంధ్ర సాంస్కృతిక సమితి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రముఖులు

హోసూరు, ఫిబ్రవరి 14: అనన్యమైన భక్తితో రాముణ్ణి కీర్తించిన రామదాసు జీవితం ధన్యమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. స్థానిక ఆంధ్ర సాంస్కృతిక సమితిలో బుధవారం జరిగిన సమావేశానికి అన్నయప్ప అధ్యక్షత వహించగా చంద్రశేఖర్ మాస్టారు సమన్వయ కర్తగా వ్యవహరించారు. శ్రీ రామదాసు జీవన చరిత్ర గురించి వివరిస్తూ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా సమస్యలను ఓర్చుకుని శ్రీరామచంద్రునిపై భక్తి విశ్వాసాల కలిగిఉండడంపై అన్నయప్ప తొలిపలుకులు పలికారు. సమితి కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ అనన్యమైన భక్తితో రాముణ్ణి కీర్తించిన రామదాసు జీవితం ధన్యమని తెలిపారు. విశ్రాంత తెలుగు పండితులు విద్వాన్ శ్రీ సత్యనారాయణ తన ప్రసంగంలో రామదాసు భక్తి తత్పరతను వివరించారు. సభ్యులు ముగళూరు విజయకుమార్ మాట్లాడుతూ తానీషా ప్రభువుకు శ్రీరాముడు కనబడడానికి, శ్రీరాముడిని రామదాసు కనుగొనడానికి తేడా ఉందన్నారు. అచంచల విశ్వాసంతో భగవంతుణ్ణి నమ్మినవారికి మాత్రమే పునర్జన్మ లేని ఆత్మ సాక్షాత్కారం కలుగుతుందని తెలిపారు. తెలుగు బాషాభిమాని మనోహర్ రామదాసు కీర్తనలను శ్రావ్యమైన కంఠంతో ఆలపించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దయానాథం ప్రసంగిస్తూ కొందరూ రాముణ్ణి కీర్తనల ద్వారా స్మరించి తరిస్తే మరికొందరు కేవలం నామ పారాయణ చేయడం వల్ల ముక్తిని పొందారన్నారు. మరో భాషాభిమాని కేశవ కొన్ని రామదాసు కీర్తనలు ఆలపించారు. చంద్రశేఖర్ మాస్టారు మాట్లాడుతూ రామ శబ్దంతో కూడితే పథమైన, పదమైనా, పాదమైనా ఆ విలువ వేరని, సమావేశంలో సత్యనారాయణ మాస్టారు, దేశెట్టిపల్లి, మునిరాజు, శ్రీనివాస్, శ్రీనివాస్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించని దుకాణాలకు సీల్

హోసూరు, ఫిబ్రవరి 14: హోసూరు కార్పొరేషన్ పరిధిలో పన్ను చెల్లించని దుకాణాలకు కార్పొరేషన్ అధికారులు సీల్ వేశారు. హోసూరు కార్పొరేషన్‌లో మొత్తం 45 వార్డులు ఉండగా వేల సంఖ్యల్లో దుకాణాలు, వాణిజ్య సంస్థలు పనిచేస్తున్నాయి. బాగలూరు రోడ్డు బస్‌స్టాప్‌ల్లో తదితర ప్రాంతాల్లోని పలు దుకాణాలు పన్ను బకాయి ఉంది. దీనిపై కార్పొరేషన్ పలుమార్లు నోటీసులు పంపినా డబ్బులు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో బుధవారం హోసూరు కార్పొరేషన్ అసిస్టెంట్ కమీషనర్ టిటో నేతృత్వంలో 10 మంది సభ్యుల బృందం బకాయి ఉన్న దుకాణాలకు సీల్ వేశారు. అలాగే వార్షిక పన్ను చెల్లించని వారి నుంచి కార్పొరేషన్ అధికారులు పన్ను వసూలు చేశారు. ఇతర వార్డులలోనూ పన్ను బకాయిలు వసూలు చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

హోసూరు(సిఫ్‌కాట్), ఫిబ్రవరి 14: వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య ప్రదానం చేశారు. కార్యక్రమానికి కావేరి ఆసుపత్రి సీనియర్ మేనేజర్ జాయ్ వర్గీస్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఆరోగ్య కమిటీ అధ్యక్షుడు మాదేశ్వరన్, జిల్లా డీఎంకే కోశాధికారి సుకుమారన్ తదితరులు పాల్గొన్నారు. పీటీఏ కోశాధికారి వెంకటేశ్, ఉప కార్యదర్శి శక్తివేల్, ప్యానెల్ సభ్యులు మోసిన్ తాజ్ నిసార్, యశ్విని మోహన్, ఉపాధ్యక్షుడు శ్రీధర్, కుమార్, ఇక్రమ్, మురుగన్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హాజరైయ్యారు. పాఠశాల వాలీబాల్ కోచ్ థాయుమానవన్‌తో సహా పాఠశాలకు సహకరించిన వివిధ ప్రముఖులను సన్మానించారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ గోవిందస్వామి మాట్లాడుతూ విద్యార్థుల సాధనపై ప్రసంగించారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు



డీసీ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన జగదీశ్ గంగణ్ణవర్

రాయచూరు, ఫిబ్రవరి 14 : మార్చి 1వ తేదీన నగరంలోని మహాత్మగాంధీ క్రీడామైదానంలో నిర్వహించ తలపెట్టిన ప్రభుత్వ ఉద్యోగుల క్రీడాపోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు జరగాలని నగరాభివృద్ధి డైరెక్టర్ జగదీశ్ గంగణ్ణవర్ సూచించారు. క్రీడల నిర్వహణకు సంబంధించి జిల్లాధికారి కార్యాలయంలో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జగదీశ్ గంగణ్ణవర్, అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు క్రీడా పోటీల్లో పాల్గొనేలా యూనియన్‌లు సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పోటీలు, క్రీడలతో పాటు సాంస్కృతిక పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయన్నారు. పోటీలో పాల్గొనే ఉద్యోగులు ఈ నెల 20వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పోటీల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోటీలకు హాజరైయ్యే వారికి భోజన వసతి ఇతరత్ర ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు.

బీమా సొమ్ము మళ్లింపు పై కేసు నమోదు

రాయచూరు, ఫిబ్రవరి 14 : ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకానికి సంబంధించి పరిహారంగా అందిన బీమా సొమ్మును దారి మళ్లించిన ఆరోపణ పై 22 మంది పై మాన్వి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మాన్వి తాలూకా భోగావతి గ్రామంలో 2022-23వ సంవత్సరానికి సంబంధించి దాదాపు 220 మందికి పైగా రైతుల పేరున పంటనష్టం పేరుతో రూ.1,10,81, 822లను బీమా సొమ్ముగా తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. మాన్వి పోలీసులు 22 మంది నిందితుల పై కేసులు నమోదు చేశారు.


మాన్వి తహసీల్దార్‌గా జగదీశ్

రాయచూరు, ఫిబ్రవరి 14 : జిల్లాలో మాన్వి తాలూకా నూతన తహసీల్దార్‌గా జగదీశ్ ఎస్ చౌర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. లోకసభ ఎన్నికల నేపథ్యంలో దీర్ఘకాలంగా పని చేస్తున్న అధికారులను బదిలీ చేస్తున్న ప్రభుత్వం అందులో భాగంగా మాన్వి తహసీల్దార్‌గా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహిస్తున్న రాజు ఫిరంగిని బదిలీ చేసింది. ఆయన స్థానంలో కలబుర్గి జిల్లా శాహబాద్ తాలూకా తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జగదీశ్ ఎస్ చౌర్‌ను మాన్వికి బదిలీ చేసింది. ఆయన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

గురు మణిమాధవ చాక్యార్ (జయంతి)




'పద్మశ్రీ' గ్రహీత గురు మణి మాధవ చాక్యార్ 1899 ఫిబ్రవరి 15న కేరళ రాష్ట్రం కోజికోడ్ ప్రాంతంలో జన్మించారు. సంప్రదాయ బద్ధమైన కూడియాట్టం, సంస్కృత నాటకాలపై పట్టు సాధించారు. కనుబొమలతోనే సైగలు చేస్తూ ఎన్నో భావాలు పలికించడంతో 'రస అభినయ చక్రవర్తి'గా పేరొందారు. కూడియాట్టంకు సంబంధించి నాట్య కల్పద్రుమం రచన చేశారు. కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, కేరళ కళామండలం ఫెలోషిప్, తులసి సమ్మాన్ ఆఫ్ మధ్యప్రదేశ్, గురువాయూర్ దేవస్వోం అవార్డు తదితర పురస్కారాలు పొందారు. 1990 జనవరి 14న కన్నుమూశారు.

ఇరెనా సెండ్లర్ (జయంతి)



ఇరెనా స్టానిస్లావా సెండ్లర్ 1910 ఫిబ్రవరి 15న జన్మించారు. రెండో ప్రపంచ యుద్ధంలో నర్సుగా సేవలందించిన ఆమె పోలెండ్ దేశానికి చెందిన గొప్ప మానవతావాది, సంఘ సంస్కర్తగా గుర్తింపు పొందారు. 1935 నుంచి 1943 వరకు వార్సా నగరంలో సాంఘిక సంక్షేమ, ప్రజా ఆరోగ్యం విభాగంలో పనిచేశారు. పోలెండ్ దేశం నుంచి ఆర్డర్ ఆఫ్ వైట్ ఈగల్, ఇజ్రాయెల్ నుంచి రైటియస్ అమాంగ్ ది నేషన్స్ గుర్తింపు పొందారు. 98వ యేట 2008లో కన్నుమూశారు.

మాస్టర్ హిరణ్ణయ్య (జయంతి)



ప్రముఖ కన్నడ నటుడు, నాటక రంగ కళాకారుడు మాస్టర్ హిరణ్ణయ్య 1934 ఫిబ్రవరి 15న మైసూరులో జన్మించారు. ఆయన తండ్రి కే హిరణ్ణయ్య బాటలోనే నటుడిగా రాణించారు. 30 సినిమాలకుపైగా నటించారు. కథ, స్క్రీన్‌ప్లే కూడా అందించడమే కాక నేపథ్య గాయకుడిగా కూడా ప్రతిభ చాటారు. 'లంచావతార' నాటకం 45 సంవత్సరాలలో అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, ఇంగ్లండ్ తదితర దేశాలలో 11వేల సార్లకు పైగా ప్రదర్శించ బడడం ఒక రికార్డుగా నిలిచింది. రే, కేర్ ఆఫ్ ఫుట్ పాత్ 2, నెంబరు 73 శాంతి నివాస సినిమాలు ఆయనకు మరింత గుర్తింపు తెచ్చాయి. రాజ్యోత్సవ పురస్కారం, సంగీత నాటక అకాడమీ అవార్డు, అంకరు నిర్మాన్ స్వర్ణ అవార్డు, మహా అద్వైతి అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2019 మే 2న కన్నుమూశారు.

రాధారెడ్డి (పుట్టినరోజు)



కూచిపూడి రంగంలోనే కాక యావత్ కళాలోకానికి రాజా- రాధా రెడ్డిలుగా సుపరిచితులైన రాజారెడ్డి, రాధారెడ్డి దంపతులు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారు. రాధారెడ్డి 1952 ఫిబ్రవరి 15న జన్మించారు. రాజారెడ్డి, రాధారెడ్డిలు వేదాంతం ప్రహ్లాద శర్మ దగ్గర శిష్యరికం చేశారు. ఏలూరులోని కళా క్షేత్రంలో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారు. న్యూ ఢిల్లీలో నృత్య తరంగిని అనే నాట్యపాఠశాలను ఏర్పాటు చేసి ఔత్సాహిక నాట్య కళాకారులను తీర్చిదిద్దుతున్నారు. దేశ విదేశాలలో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలను వేర్వేరుగా దంపతులు ఒకేసారి పొందడం ఒక రికార్డుగా నిలిచింది. ఆమె కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. సాంస్కృతిక రాయబారులుగా వందకుపైగా దేశాల్లో పర్యటించి నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.

మీరాజాస్మిన్ (పుట్టినరోజు)



జాతీయ పురస్కార నటి మీరా జాస్మిన్ 1982 ఫిబ్రవరి 15న కేరళ రాష్ట్రంలో తిరువల్లా ప్రాంతంలో జన్మించారు. మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ భాషల సినిమాలలో నటించారు. 2004లో పాదమ్ ఒన్ను - ఒరు విలాపం అనే కేరళ సినిమాకు జాతీయ ఉత్తమ నటి అవార్డు దక్కింది. అంతేకాక ఉత్తమ నటిగా రెండు కేరళ రాష్ట్ర ఫిల్మ్ అవార్డులు, ఒక తమిళనాడు రాష్ట్ర ఫిల్మ్ అవార్డు, కళైమామణి, వీ శాంతారం అవార్డులు అందుకున్నారు. తెలుగులో భద్ర, గుడుంబా శంకర్, గోరింటాకు తదితర సినిమాలు గుర్తింపు తెచ్చాయి.

రేపు కోదండరాముడి రథోత్సవం



ఉత్సవమూర్తులకు అలంకరణ

చేళూరు, ఫిబ్రవరి 14: తాలూకా కేంద్రమైన చేళూరులో రథసప్తమిని పురస్కరించుకుని బ్రాహ్మణ వీధిలోగల కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం అంకురార్పణ జరిగింది. సీతారామ లక్ష్మణ ఆంజనేయ ఉత్సవ మూర్తులకు విశేషపూజలు, అలంకరణ చేశారు. 15న గురువారం స్వామివారికి కళ్యాణోత్సవం, 16న శుక్రవారం రథోత్సవం జరగనుంది. మాఘమాసంలో వచ్చే రథసప్తమికి ఏటా విశేషపూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాలలో భాగంగా ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనే బ్రాహ్మణులకు రెండు రోజులపాటు ప్రత్యేకంగా కమిటీ హాల్‌లో భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు నాగభూషణం తెలిపారు.

18న నగరంలో మధుమేహ జాగృతి వాకథాన్

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): షుగర్ ఫిట్ - బీట్ డయాబెటీస్ వాకథాన్ నగరంలో ఈనెల 18న జరగనుంది. ఈమేరకు నిర్వాహకులు నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. జయనగర్ 3వ బ్లాక్‌లోని షుగర్ ఫిట్ డయాబెటీస్ రివర్సల్ కేంద్రం నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే వాకథాన్ 10 వరకు సాగనుంది. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో అన్ని వయస్సుల వారు పాలుపంచుకోనున్నట్టు సంస్థ వెల్లడించింది.

మోదీ మళ్లీ ప్రధాని కావాలి

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర



హెబ్బాళ్‌లో లోక్‌సభ నియోజకవర్గ కార్యాలయ ప్రారంభంలో విజయేంద్ర, సదానందగౌడ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశమంతా నరేంద్రమోదీని మరోసారి ప్రధానిగా చూడాలని మనసారా కోరుకుంటోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర పేర్కొన్నారు. బెంగళూరు సంజయ్‌నగర్‌లోని భూపసంద్రలో పార్టీ హెబ్బాళ మండల లోక్‌సభ కార్యాలయాన్ని బుధవారం ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన రాష్ట్రంలోనూ, దేశంలోనూ మరోసారి మోదీ ప్రచార కార్యక్రమాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలోని మొత్తం 28 లోక్‌సభా నియోజక వర్గాల్లోనూ బీజేపీ గెలుపు విశ్వాసంపై కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలేస్తోందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త తానే మోదీగా భావించి భారీ మెజార్టీతో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర బీజేపీలో ఇంతటి జోష్ గతంలో ఎన్నడూ తాను చూడలేదన్నారు. ముచ్చటగా మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ప్రధానిగా మళ్లీ మోదీ ప్రమాణస్వీకారం చేసే శుభఘడియల కోసం తామంతా ఉత్సాహభరితంగా ఎదురు చూస్తున్నామని విజయేంద్ర పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు మనకు పెద్ద సవాల్‌గా ఉందన్నారు. 8 నెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో స్వయంకృతాపరాధం వల్లే ఓటమి పాలయ్యామని ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులే కరువయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి డీవీ సదానందగౌడ, బెంగళూరు ఉత్తర జిల్లా అధ్యక్షుడు ఎస్.హరీష్, బెంగళూరు నార్త్ లోక్‌సభా నియోజకవర్గం సహ కన్వీనర్ సచ్చిదానందమూర్తి తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

వీరశైవ లింగాయతలకు అన్యాయం

● రాజ్యసభ అభ్యర్థుల ప్రకటనపై శ్యామనూరు

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ టికెట్‌ల కేటాయింపులో వీరశైవ లింగాయతలకు అవకాశం కల్పించాలనే డిమాండ్ చేసిన సీనియర్ కాంగ్రెస్‌నేత శ్యామనూరు శివశంకరప్ప మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజ్యసభ టికెట్‌లను బుధవారం కాంగ్రెస్ జాతీయ ఎన్నికల కమిటీ విభాగం ప్రకటించింది. సిట్టింగ్ ఎంపీలు జీసీ చంద్రశేఖర్, నాసిర్‌హుసేన్‌తో పాటు జాతీయ కాంగ్రెస్‌లో అపార అనుభవం కలిగిన అజయ్‌మాకెన్‌కు అధిష్ఠానం కోటాలో టికెట్ వరించింది. అజయ్ మాకెన్ ఢిల్లీ రాష్ట్ర మంత్రిగాను కేంద్ర మంత్రి గాను వ్యవహరించారు. స్థానికేతరుడికి టికెట్ కేటాయించడం ఇదేమి కొత్త సంప్రదాయం కాకున్నా లోక్‌సభ ఎన్నికల వేళ కుల, సామాజిక అంశాలు తెర పైకి వస్తున్నాయి. వీరశైవ లింగాయతుల సమాజానికి చెందినవారికి ఒకరికి రాజ్యసభ టికెట్ ఇవ్వాలని అఖిలభారత వీరశైవ మహాసభ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్‌నేత, ఎమ్మెల్యే శ్యామనూరు శివశంకరప్ప డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఆయన పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గేకు మూడురోజుల కిందట లేఖ రాశారు. వచ్చే ఎన్నికలలో పార్టీకు సమాజం మద్దతు కీలకమని భావిస్తే అవకాశం కల్పించాల్సిందేనని అభిప్రాయపడిన విషయం కూడా ఉంది. అయితే టికెట్ దక్కకపోవడంతో ఆయన మరోసారి నిరుత్సాహం వ్యక్తం చేశారు.

వయసు పైబడిన వారు రిటైర్డ్ కావాలి : ఎమ్మెల్యే రిజ్వాన్

వయస్సు పైబడినవారు రాజకీయాల నుంచి రిటైర్ అయ్యి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపితే బాగుటుందని కాంగ్రెస్‌కు చెందిన శివాజినగర్ ఎమ్మెల్యే రిజ్వాన్‌అర్షద్ నేరుగా శ్యామనూరు శివశంకరప్పను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బుధవారం రిజ్వాన్ అర్షద్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ శ్యామనూరు శివశంకరప్పకు 94 ఏళ్ళు వయస్సు వచ్చిందని ఏమి అర్థం అవుతుందో ఏమి రాస్తారో తెలియదన్నారు. వయస్సు పెరిగిన కారణంగా ఏదేదో చెబుతారన్నారు. లింగాయత మహాసభ నుంచి ఎవరూ లేఖ రాయరని కేవలం శ్యామనూరు మాత్రమే ఇలా చేస్తారన్నారు. నేను ఏం కామెంట్ చేయగలను. వయస్సుపై బడిందని రాజకీయాలనుంచి రిటైర్ ప్రకటించుకుని కుటుంబీకులతో కాలం గడపాలన్నారు. దావణగెరెలో మైనార్టీలు అధికమని వారి మద్దతుతోనే గెలుస్తున్నారన్నారు. ఇదే విషయం దావణగెరె జిల్లావాసులందరికీ తెలుసన్నారు. ఇటీవల బీజేపీ ఎంపీ రాఘవేంద్ర గెలవాలని మాట్లాడారన్నారు. వయసు పైబడిన కారణంగా విషయాలు అర్థం కావన్నారు.

నగరసభ ఆస్తి స్వాధీనం



నగరసభ ఆస్తిగా బోర్డు ప్రకటన ఇలా...

చింతామణి, ఫిబ్రవరి 14: పట్టణ కేంద్రభాగంలోని బెంగళూరు డబుల్‌రోడ్డు సర్కిల్‌లో కోట్లాది రూపాయల విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకోవడంలో నగరసభ కమిషనర్ చలపతి విజయం సాధించారు. నగరసభకు చెందిన ఆస్తిని న్యాయవాది ఒకరు కొన్ని రికార్డులతో తన సొంత జాగా అంటూ కోర్టులో దావా వేశాడు. అయితే సదరు పిటీషన్‌ను కోర్టు కొట్టివేసింది. దీంతో ఆస్తిని నగరసభ స్వాధీనం చేసుకున్నట్టు కమిషనర్ జీఎన్ చలపతి బుధవారం మీడియాకు తెలిపారు. ఈమేరకు నగరసభ అధికారులు, సిబ్బంది వెళ్లి సదరు వాణిజ్య దుకాణానికి వెళ్లి నగరసభ ఆస్తిగా బోర్డు వేశారు. అంతేకాక బాడుగ మొత్తాన్ని ఇవ్వాలని, బకాయి చెల్లించాలని దుకాణ యజమానికి సూచించారు.

మేకప్ కళకు భారీ ఆదరణ

» అంతర్జాతీయ కళాకారిణి సనా



శిక్షణలో పాల్గొన్న ప్రముఖులు

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా మేకప్ కళకు భారీ ఆదరణ లభిస్తోందని లక్షలాది మంది ఈ కళ గొప్పదనాన్ని చాటిచెబుతూ ఉపాధి పొందుతున్నారని అంతర్జాతీయ కళాకారిణి సనా పేర్కొన్నారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్లోబల్ ప్రొఫెషనల్ సౌందర్యవర్ధక బ్రాండ్ క్రయోలాన్ బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన వాలెంటైన్స్ డే మేకప్ మాస్టర్ క్లాస్‌ను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. మేకప్ కూడా అద్భుతమైన గొప్ప కళ అన్నారు. మేకప్‌లోని కిటుకులను 3 కొత్తలుక్‌ల సాంకేతికతను ఆమె సోదాహరణంగా వివరించారు. ప్రేమికుల దినోత్సవం కోసమే ప్రత్యేకంగా ఈ మూడు లుక్‌లను సిద్ధం చేసినట్లు చెప్పారు. మేకప్ రంగంలో చోటు చేసుకుంటున్న ఆధునిక సాంకేతికను సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఈ రంగానికి చెందిన మేకప్ ఆర్టిస్టులకు పిలుపునిచ్చారు. ప్రముఖ ఫ్యాషన్ స్పెషలిస్టు ప్రసాద్ బిడ్డప్ప, అవివా బిడప ముఖ్యఅతిధులుగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు క్రయోలాన్ కాస్మెటిక్స్ ఇండియా సిఓఓ క్లాడియోలోరెట్టి కోరోలెక్ మాట్లాడుతూ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బెంగళూరులో ప్రతియేటా ఏదో ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించుకుంటూ వస్తున్నామన్నారు. ఈ సారి మేకప్ రంగంపై ఆసక్తి గలిగిన యువతకోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని దీనికి చక్కటి స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు.

పన్ను బకాయి.. రాక్‌లైన్ మాల్ సీజ్



మాల్ గేట్‌కు సీజ్ ఇలా...

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పన్ను బకాయి పడ్డంతో బెంగళూరు టీ దాసరహళ్ళిలో ప్రముఖ నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ నిర్వహణలోని మాల్‌ను బీబీఎంపీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఇప్పటికే పలు నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో దాసరహళ్ళి జోన్ అధికారులు స్థానిక పోలీసులు, మార్షల్స్ సహకారంతో మాల్‌కు చేరుకుని తాళం వేశారు. దీనిపై బీబీఎంపీ అధికారి ఒకరు మీడియాతో మాట్లాడుతూ 2011 నుంచి 2023 వరకు ఈ మాల్ రూ.11.51 కోట్ల మేర పన్ను బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. డిమాండ్ నోటీసు జారీ చేసినా స్పందన లేకపోవడంతోనే కార్యాచరణ చేపట్టాల్సి వచ్చిందన్నారు. కాగా 2023 డిసెంబరులోనూ రూ.51 కోట్ల మేరకు బకాయిపడిన మంత్రి మాల్‌ను సీజ్ చేసిన సంగతి ఈ సందర్భంగా గమనార్హం. బీబీఎంపీకి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని బీబీఎంపీ అధికారులు వెల్లడించారు.

రాజ్యాంగ జాగృతి జాతా



జాగృతి వాహనానికి జెండా చూపుతున్న ఓఈ మునిరాజు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 14: రాజ్యాంగంపై జాగృతి కల్పించేలా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జాగృతి వాహనాలు సంచరిస్తున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలోనూ జాగృతి జాథా సాగింది. తాలూకా కార్యాలయం వద్ద పంచాయతీ ఈఓ మునిరాజు జాథాకకు పచ్చజెండా చూపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రాధాన్యతను వివరించారు. రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల విద్యార్థులు, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు. దళిత సంఘర్ష సమితి ప్రముఖులు చైతన్యగీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సాంఘిక సంక్షేమశాఖ సహాయక డైరెక్టర్ జగదీశ్, తాలూకా ఆరోగ్య అధికారి వెంకటేశ్‌మూర్తి, సీడీపీఓ నౌతాజ్, దళిత సంఘర్ష సమితి చలపతి, దేవరాజ్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్యూజన్ కార్నివాల్

బంగారపేట, ఫిబ్రవరి 14: పట్టణంలోని కామసముద్ర మెయిన్‌రోడ్డు దేశిహళ్ళి సమీపానగల డిజిటల్ గ్లోబల్ పాఠశాల ఆధ్వర్యంలో ఫ్యూజన్ కార్నివాల్ పేరిట వార్షికోత్సవం ఉత్సాహంగా సాగింది. రాష్ట్ర నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఎస్ఎన్ నారాయణస్వామి మాట్లాడుతూ ఐదు మందితో ప్రారంభమైన పాఠశాల రెండేళ్లలో 250మందికి చేరుకోవడం అభినందనీయమన్నారు. ఇక్కడ కరాటే, కంప్యూటర్, నృత్యం, మొబైల్ యాప్, సంగీతం తరగతులు, అబాకస్, జాతీయస్థాయి ప్రమాణాలతో బోధను అందిస్తుండడం సంతోషకరమన్నారు. బీఈఓ డీఎస్ సుకన్య మాట్లాడుతూ విద్యార్థులు అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారన్నారు. చక్కటి ప్రతిభతో పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సమన్వయాధికారి శశికళ, పాఠశాల సంస్థాపక ముఖ్యులు మంజునాథ్, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న కుమారి, ఉపాధ్యాయులు నివేది, భానుప్రియా, సుష్మా, ఎలిజబెత్ చాకో, కలై వాణి, సంగీత, సింధూ, లక్ష్మీ, శృతి, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో బొటానికల్ గార్డెన్

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో శాస్త్రవేత్తగా సేవలందించి పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్ ఎస్ రమేష్ బాబు ప్రపంచ రికార్డుల సృష్టిలోనే కాకుండా పర్యావరణ సంరక్షణలోనూ ఒక అడుగు ముందున్నారు. డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) విధానం ద్వారా తన సోసురంబ ఫామ్‌లో వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. రెండేళ్ళ క్రిందట రమేష్‌బాబు మైసూరు జిల్లా నంజనగూడు తాలుకా హల్లారె గ్రామ సమీపంలోని ఈ ఫామ్‌లో నాటిన 700కు పైగా వివిధ రకాల మొక్కలు కేవలం బిందుసేద్యంతోనే వృక్షాలుగా ఎదుగుతున్నాయి. ఫామ్ హౌస్‌లో ఆవులు, గొర్రెలు, మేకలను కూడా సంప్రదాయ పద్ధతుల్లో ఆయన పెంచుతున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా పూర్తిగా సేంద్రీయ పద్ధతుల్లో ఇక్కడ బిందు సేద్యం ద్వారా ఈ ఫామ్ హౌస్‌ను తీర్చిదిద్దానని వ్యవసాయ రంగంలో పరిశోధనలు చేసే విద్యార్థులు ఎవరైనాసరే ఫామ్ హౌస్‌ను తిలకిస్తే వారికి అవగాహన కల్పిస్తానని డాక్టర్ రమేష్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు ఈ ఫామ్‌హౌస్‌లోని బొటానికల్ గార్డెన్‌ను తిలకించారన్నారు. మొక్కల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ వహించడం రోజుకు కనీసం 8 నుండి 10 గంటల పాటు తోటలోనే గడపడం వంటివి చేస్తున్నానని ఫలితంగా రెండేళ్ళ క్రితం నాటికి మొత్తం 700 మొక్కలు ఏపుగా ఎదిగి చెట్లయ్యాయన్నారు. తోటలపై ఆసక్తి ఉన్న వారికోసం ప్రతివారం ప్రత్యేకక్లాస్‌ను కూడా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తన ఫామ్‌హౌస్‌లోని తోటలో పండ్ల చెట్లతో పాటు ఆయుర్వేద ఔషధ చెట్లు కూడా పెద్దసంఖ్యలో ఉన్నాయన్నారు.



రెండేళ్ల శమీవృక్షం, రెండేళ్ల వక్క, కొబ్బరి చెట్టు

సీఎం, డీసీఎంను కలిసిన ఆశా కార్యకర్తలు



సీఎంకు వినతి అందజేస్తున్న ఆశా కార్యకర్తల సంఘం ప్రతినిధులు

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని ఫ్రీడంపార్కులో ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ స్వయంగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు బుధవారం ప్రత్యేకంగా వినతిపత్రాలను సమర్పించారు. బడ్జెట్‌లో ఆశా కార్యకర్తల సమస్యలకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం నలుమూలలనుంచి వేల సంఖ్యలో ఆశా కార్యకర్తలు ఫ్రీడంపార్కులో నిరవధిక ధర్నా చేస్తున్న సంగతి విదితమే. 60ఏళ్ల పూర్తి చేసుకుని రిటైరైన వారికి రూ.3లక్షల పరిహారం ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్‌తోపాటు నెలకు కనీస ప్రోత్సాహధనం రూ.15వేలు ఇవ్వాలన్న డిమాండ్‌తో ఆశా కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. ఎండకు చలికి లెక్కించక పసిబిడ్డలతో కలసి ధర్నాలో పాల్గొంటున్న ఆశా కార్యకర్తలను ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు మంగళవారం పరామర్శించి ధర్నాను విరమించుకోవాలని సూచించారు. డిమాండ్లు పరిష్కారమయ్యేంతవరకు విరమించేది లేదని ఆశా కార్యకర్తల సంఘం కార్యదర్శి డీ నాగలక్ష్మి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిని కలసి సమస్యలు విన్నవించామన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

వాహనాల హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్లకు మూడు నెలల గడువు పెంపు

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌పీ) అమర్చుకునేందుకు మరో మూడు నెలలు గడువు పెంచుతున్నట్టు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి వెల్లడించారు. విధాన పరిషత్‌లో బుధవారం కాంగ్రెస్ సభ్యుడు మాదేగౌడ అడిగిన ప్రశ్నకు సమాధానంగా హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్‌లు అమర్చుకునేందుకు ఈనెల 17తో గడువు ముగియనుందన్నారు. ఆశించినంతమేర ప్రక్రియ కొనసాగలేదన్నారు. 2023 నవంబరులో గడువు పెంచామన్నారు. అయితే లక్షలాదిమంది ఇంకా నమోదు చేసుకోలేదన్నారు. రాష్ట్రంలో 18,32,787 వాహనాలకు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌లను అమర్చుకున్నారన్నారు. దీని ప్రకారం 9.16శాతం మాత్రమే సాధ్యమైందన్నారు. ఇంకా 91 శాతం వాహనాలకు హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్‌లు సమకూర్చుకోవాల్సి ఉందన్నారు. ప్లేట్‌లు సమకూర్చుకునే విషయంలో పారదర్శకత ఉండాలనే పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసలుబాటు ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్‌లు లేకుంటే తొలిసారి రూ.500, రెండోసారి నుంచి వెయ్యి రూపాయల జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కేఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే బాలకృష్ణ



బాలకృష్ణను అభినందిస్తున్న డీసీఎం

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కేఎస్ఆర్టీసీ) చైర్మన్‌గా నియమితులైన రామనగర జిల్లా మాగడి ఎమ్మెల్యే బాలకృష్ణ బెంగళూరు కేపీసీసీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు. తనకు ఈ కీలక బాధ్యతను అప్పగించి నందుకుగాను ధన్యవాదాలు తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణ అవకాశం కల్పిస్తున్న శక్తి పథకాన్ని మరింత విజయవంతంగా అమలు చేసే దిశలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను బలోపేతం చేసే అంశంపై దృష్టి సారిస్తానని అనంతరం బాలకృష్ణ ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓటమి తప్పదన్న నిరాశతోనే బీజేపీ ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. కన్నడిగులు శాంతి ప్రియులని బీజేపీ వలలో చిక్కుకోరని ఆయన పేర్కొన్నారు.

బెస్కాం కార్యాలయం ముట్టడి

చింతామణి, ఫిబ్రవరి 14: పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రైతు సంఘం, హసిరుసేన పదాధికారులు పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్, అటవీశాఖల అధికారుల వైఫల్యాన్ని ఖండిస్తూ నినాదాలు చేశారు. రైతుసంఘం తాలూకా అధ్యక్షుడు సీకల్ రమణారెడ్డి నేతృత్వంలో ర్యాలీ సాగగా పోలీసులు అడ్డుకుని కేవలం బెస్కాం కార్యాలయం ముందు నిరసనకు అవకాశం కల్పించారు. ప్రవాసి మందిర నుంచి పెద్దసంఖ్యలో రైతుసంఘం సభ్యులు ఊరేగారు. రమణారెడ్డి మాట్లాడుతూ సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పంప్‌సెట్లకు సక్రమంగా విద్యుత్ అందడం లేదని, ఒకవేళ వచ్చినా లో ఓల్టేజ్ సమస్య ఉందన్నారు. తాలూకా ప్రదేశం సరిహద్దులో ఉండడంతో ఎక్కువగా కొండగుట్టలు ఉన్నాయని, వన్య జీవులు ముళ్ళపంది, జింక, కోతులు, నెమలులు ఇతరత్రా పంటలను నాశనం చేస్తున్నాయని వీటిని నియంత్రించడంలో అటవీశాఖ అధికారులు విఫలమయ్యారని ఆక్రోశం వ్యక్తం చేశారు. కనీసం ఏడుగంటలపాటు త్రీఫేజ్, 10హెచ్‌పీ పంప్‌సెట్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బెస్కాం కార్యనిర్వాహక అధికారి, ప్రాంతీయ అటవీ అధికారి చందన్‌లు రైతులనుంచి వినతిని స్వీకరించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. నిరసనలో సంఘం జిల్లా అధ్యక్షుడు రమానాథ్, తాలూకా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ ఆంజనేయరెడ్డి, గంజూరు నారాయణస్వామి, అల్లాబక్ష్, కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అయోధ్యధామ' ప్రత్యేక రైలుకు పచ్చజెండా



పచ్చజెండా చూపుతున్న నేతలు

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని శ్రీరాముడి దర్శనం కోసం బెంగళూరు నుండి బయల్దేరిన అయోధ్య ధామ ప్రత్యేక రైలుకు నగరంలోని బయప్పనహళ్ళి రైల్వేస్టేషన్‌లో మంగళవారం రాత్రి పచ్చజెండా చూపారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ సభ్యుడు పీసీ మోహన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రజలు అయోధ్య రాముడి దర్శనం కోసం తరలివెళుతుండటం సంతోషంగా ఉందన్నారు. కర్ణాటక నుంచి కేవలం నెల రోజుల అవధిలోనే వేలాది మంది అయోధ్యకు తరలి వెళ్ళారన్నారు. ఈ సందర్భంగా అయోధ్య శ్రీరామ మందిర అభియాన రాష్ట్ర కన్వీనర్ సిద్ధరాజు, సహ కన్వీనర్ జగదీష్ హీరేమని, అభియాన రైల్వే కన్వీనర్ డిటి.విజయేంద్ర తదితరులు హాజరయ్యారు. అంతకు ముందు అయోధ్యకు బయల్దేరిన భక్తులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. రైల్వే స్టేషన్ ప్రాంగణమంతా జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగింది.

కలర్‌విజన్ బుక్‌ను ప్రారంభించిన నిప్పాన్

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కలర్‌విజన్ బుక్ పేరిట 2024-25 సంవత్సరానికిగాను నాలుగు నూతన ఆవిష్కరణలను నిప్పాన్ పెయింట్ సంస్థ నగరంలో లాంఛనంగా విడుదల చేసింది. సంస్థ కన్సల్టెంట్‌గా ఉన్న డాక్టర్ కౌస్తవ్ సేన్ గుప్త సహకారంతో హీల్, బ్లూమర్స్, హైవా, సోల్‌పోర్ అనే వర్ణాలను విడుదల చేసినట్టు సంస్థ వెల్లడించింది. ఇవి విస్తృత పరిశోధనల అనంతరం రూపుదిద్దుకున్నాయని దీర్ఘకాలిక మన్నిక ఇచ్చేవని సంస్థ ఇండియా విభాగం చైర్మన్ ఎస్ మహేశ్ ఆనంద్ వెల్లడించారు. ఈ నాలుగు ఆవిష్కరణల వివరాలను మీడియాకు సోదాహరణంగా వివరించారు. నేటితరం ఇష్టపడేలా వీటిని తయారు చేశామన్నారు.

ఇరుకు గదిలో గ్రంథాలయం



రా చెరువులోని గ్రంథాలయమిదే...

చేళూరు, ఫిబ్రవరి 14: తాలూకాలోని రా చెరువు గ్రామ పంచాయతీ కేంద్రంలో 2001లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఇరుకు గదులలోనే గ్రంథాలయం కొనసాగుతోంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీకి అనుబంధమైన ఒక షటర్ గదిలోనే నిర్వహిస్తున్నా లైబ్రేరియన్ సహా నలుగురైదు గురికి మించి కూర్చునే స్థలం లేదు. గ్రంథాలయంలో మంచి పుస్తకాలు ఉన్నా కూర్చుని చదివేంత స్థలం లేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, పాఠకులకు వీలుగా తగిన సౌకర్యాలు కల్పించాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. దీనిపై పీడీఓ శైలజా స్పందిస్తూ త్వరలోనే గ్రంథాలయానికి తగిన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.